# గాలి

సృష్టిలో ఉన్న గాలి నంతటినీ ఏ అదృశ్య శక్తి తన ఉక్కు పిడికిలిలో బంధించి వుంచిందో తెలీదు. రోజుల తరబడి రాళ్ళు పగిలే ఎండలు....వాటికి తోడు ఎక్కడా ఆకయినా కదలదు. ఆకాశంలో చిన్న మబ్బు తునక అయినా ఉండదు. సూర్యుడు ఉదయించడమే ప్రళయ భీకరంగా వికటాట్టహాసం చేస్తూ వేడిగా ఉదయిస్తాడు. అక్కడి నుండి ఆయన భయంకర పరిపాలన మొదలు....భూమి నంతటినీ సున్నితమైన మంటలలో చుట్టి బాధించి చివరకు విజయ గర్వంతో పడమటి కొండల్లో దిగి వెళ్ళిపోతాడు. అయినా, సూర్యుడి పరోక్షంలో కూడా గాలి ఉండదు. ఎప్పుడో రాత్రి బాగా ప్రొద్దుపోయిన తర్వాత గాలి కొద్దిగా కదులుతుంది. కాస్సేపు అటూ ఇటూ వీస్తుంది. మళ్ళీ ఉదయం వేళకు ఎలా మాయమవుతుందో తెలీదు. అంతలో మళ్ళీ సూర్యుడు హుంకరిస్తూ తూర్పు కొండలు ఎగ్రబాకి పైకి వచ్చేస్తాడు.

ఆ మేడ చాలా పాతది. నాలుగంతస్తులలోనూ దాదాపు ఇరవై కాపురాలున్నాయి. ఆ మేడ యజమాని ఇటీవలే చచ్చిపోయాడు. ఆయన ఆస్తినంతటిని ఎలా సంపాయించాడో అక్కడి జనం కథలుగా చెప్పుకుంటారు. ఆ కథల మాట ఎలావున్నా, డబ్బు సంపాయించడం, జాగ్రత్తగా కూడబెట్టడం, దాన్ని ఎక్కడ మదపు పెట్టాలో అక్కడ మదుపు పెట్టడం - ఇటువంటి వ్యాపకాలతోనే ఆయన జీవితం ప్రతి క్షణం గడిపాడనేది సత్యం. మానవులన్న తర్వాత ఎవరికైనా కొన్ని యిబ్బందులు రాక తప్పవు. ఆయన చాలా జాగ్రత్తగా యిబ్బందిలో వున్నవాళ్ళను గమనించేవాడు. వారిచేత అడిగించుకునేవాడు. కొంచెం బెట్టు చూపేవాడు. రెండు మూడు సార్లు తిప్పించుకునేవాడు. ఇబ్బందిలో వున్న వ్యక్తికి దేశంలో డబ్బు అంతా ఎక్కడో మటుమాయం అయిపోయిందనీ, డబ్బు కళ్ళబడటం గొప్ప విశేషమనీ అర్థమైన తర్వాత చాలా కష్టంమీద సర్దుతున్నట్టు అడిగిన దానిలో సగమో మూడో వంతో సర్దేవాడు. కావలసిన మేకు బిగుంపులన్నీ నిరాటంకంగా ఆయన చెప్పిన ప్రకారం జరిగిపోయేవి. నోట్లు వ్రాయించుకోవడం, తనఖాలు పెట్టించుకోడం అన్నీ మామూలే. తర్వాత కొంత కాలం గడిచేది. మనిషి యిబ్బందిలో పడటం ఎంత సామాన్య విషయమో, ఇబ్బందిలో పడ్డవాడు మళ్ళీ తేరుకోడం అంత అసామాన్యమైన విషయం. మళ్ళీ మళ్ళీ అతనికి డబ్బు అవసర మవుతుంది. ఆయన చాలా మంచిగా మళ్ళీ అప్పు పెట్టేవాడు. ఏ పరిస్థితుల్లోను అవతలి వాడి తాహతుకు మించి డబ్బు యిచ్చేవాడు కాదు. క్రమంగా అవతలి వ్యక్తి జుట్టూ, మాన మర్యాదలూ, పరువు ప్రతిష్టలూ అన్నీ ఈయన చేతిలోకి వచ్చేవి. ఆయన సమయం చూసి ఒకానొక నాడు "నా డబ్బేది?" అని అడిగేవాడు. ఇక అంతా మాములే...అవతలి వ్యక్తి ఇవ్వలేక పోవడం, మరికాస్త వ్యవధి కావాలని ప్రాధేయపడటం, అన్నీ జరిగేవి. ఆయన ససేమిరా వీల్లేదనే వాడు. తాను ఎంతగా ఆర్థిక బాధల్లో వున్నాడో వివరించేవాడు. చివరకు చాలా సహృదయంతో, సానుభూతితో ఒక సదుపాయం సూచించేవాడు. "ఈ అప్పులూ వడ్డీలూ ఎందుకు? హాయిగా అమ్మిపారెయ్యరాదూ! వడ్డీ అయినా కలిసొస్తుంది..."అనేవాడు. అవతలి వాడు

అప్పటికే విసిగిపోయి తల ఊపేవాడు. ఇక ధర కట్టడం, బాకీలు పోను మిగిలిన మొత్తం ఇచ్చేయడం, రిజిస్ట్రేషన్లూ వగైరా అన్నీ జరిగిపోయేవి. ఇక ఆ యిల్లు తన అధీనంలోకి రాగానే ఆయన దాన్ని జాగ్రత్తగా పరిశీలించి కొంత డబ్బు ఖర్చు పెట్టి మార్పులూ, చేర్పులూ చేయించేవాడు. దాన్ని అనేక భాగాలుగా విభజించి అద్దెల కిచ్చేవాడు.

ఈ విధంగా ఆయనకు ఒచ్చిపడిన అయిదారు యిళ్ళలోనూ అది ఒకటి. ఆయన చాలా నెలలు మంచానపడి తీసుకుని చచ్చిపోయాడు. ఆయనకు సంతానం లేదు. ఒకణ్ణి పెంచుకున్నాడు. ఆ కుర్రవాడు పెంపకం జరిగేనాటికి పద్దెనిమిదేళ్ళవాడు. ఆయన మంచాన పడ్డప్పుడు అతడు చాలా శ్రద్ధగా డాక్టర్ల చుట్టూ తిరిగాడు. మందులు తెచ్చాడు. రోజూ కొంతసేపు ఆయన మంచం పక్కన దిగులుగా కూర్చునేవాడు. ఇతరులకు కూడా ఎల్లప్పుడూ దిగులుగా కనిపించేవాడు. అతని వాలకం గమనించి అందరూ పాపం! కుర్రవాడు చాలా దిగులు పడిపోయాడు" అనుకున్నారు. ఆ కుర్రవాడి మనసులో ఏముందో ఆ పరమాత్ముడికే తెలియాలి. ఆయన అప్పుడప్పుడు కళ్ళు తెరిచి కొడుకు వంక చూసి ఏదో మాట్లాడేందుకు ప్రయత్నించేవాడు. కాని మాట పైకి వచ్చేది కాదు. ఒక రోజు ఆయన అతన్ని బాగా దగ్గరికి జరగమని సైగచేసి ఆస్తిపాస్తులకు సంబంధించిన ముఖ్యమైన కాగితాలున్న బీరువా తాళంచెవులు అతనికప్పగించి ఆ చేతిని చాలా సేపు విడిచి పెట్టలేదు. కొడుకుకూడా ఆ చల్లని చేతిని విడిపించుకునే ప్రయత్నం చేయలేదు. కొద్ది నిముషాలలో ఆయన నిద్రతోనో, మైకంతోనో ప్రక్కకు వాలిపోయాడు. ఆ రాత్రే ఆయన చచ్చిపోయాడు. నలుగురూ చూస్తూ వుండగా ఆ కుర్రవాడు నిశ్శబ్దంగా ఏడుస్తూ పక్కగదిలోకి వెళ్ళి తలుపు వేసుకున్నాడు. తెల్లవారు జామున కొందరు జనమూ, చుట్టుపక్కల వారూ రకరకాల బ్రాహ్మలూ ఇంటిముందు చేరి తలా ఒక వైపున రొదచేస్తూ, వుండగా బయటికి వచ్చాడు. ఎర్రగా ఉన్న అతని కళ్ళూ, అలసట సూచించే వాలకమూ గమనించి అందరూ అతను రాత్రల్లా ఏడుస్తూ గడిపి వుంటాడని అనుకున్నారు. అతడు రాత్రి అంతా నిద్రపోని మాట వాస్తవం. ఆ బీరువా తీసి అందులో వున్న కాగితాలన్నింటినీ ఒకదాని తర్వాత ఒకటిగా చదువుతూ అర్థం చేసుకుంటూ డబ్బు లెక్కపెట్టుకుంటూ కూర్చుండిపోయాడు. తెల్లవారిన తర్వాత బయటికి వచ్చి ఇక అవసర కార్యక్రమాలు ప్రారంభించాడు. వంద రూపాయలు ఖర్చు పెట్టలేదు. అంతా లోకులమీద ఉంది. మా నాన్నగారు అడిగిన వాడికల్లా లేదనకుండా అప్పులిచ్చారు. దీనితో ప్రస్తుతానికి సర్దుకోండి..." అని యాభై మాత్రమే ఖర్చు పెట్టాడు. ఎవరో కావలసిన వారి దగ్గర అతడు కొంత పైకం అప్పు అడిగి తీసుకుని తన వాదానికి బలం చేకూర్చుకున్నాడు. ఆవిధంగా అంత్యక్రియలు పూర్తి చేశాడు. తర్వాత ఊళ్ళో ఉన్న తన యిళ్ళకు పోయి వాటిలో కాపురాలుంటున్న ప్రతి ఒక్కరినీ కలుసుకుని చాలా ఆప్యాయంగా మాట్లాడి వచ్చాడు. అతన్ని చూసి అందరూ తలలూపి "కుర్రవాడు మంచివాడే సుమీ" అనుకున్నారు. కాలక్రమేణాగాని అతని అసలు రూపం తెలిసి రాలేదు. ప్రతినెలా రెండవ తేదినాడు హాజరయ్యేవాడు. ఒకటవ తారీకు జీతాలు తీసుకున్నవాళ్ళు, చచ్చినట్టు జమకట్టవలసిందే. ఏ యింట్లో ఏ భాగంలో అద్దెకున్న వారికి ఒకటవ తారీఖున జీతాలు వస్తాయో, మరెవరికి ఏడవ తేదిన వస్తాయో, అతనికి స్పష్టంగా తెలుసు. జీతాలందిన మరుసటిరోజూ వెళ్ళి డబ్బు రాబట్టుకోకపోతే మరివారు యివ్వలేరనీ తెలుసు. అందువల్ల

అతడు ఠంచనుగా ఏ యింటికేవేళ హాజరుకావాలో ఆరోజూ అదే సమయంలో హాజరయ్యేవాడు. ఇద్దరు ముగ్గురు పెద్దలు అతన్ని వివాహ విషయంలో కదిపిచూసి నిరాశ చెందారు. అతడు "నేనిప్పుడు పెళ్ళి చేసుకోను... ఆ విషయమై మళ్ళీ మళ్ళీ మీరు రానక్కరలేదు." అని స్పష్టంగా చెప్పేశాడు. రాత్రిళ్ళు యింటికాలస్యంగా వస్తాడనీ అలాటివే మరికొన్ని చిన్న చిన్న అపవాదులు ఉన్నాయి. అవి చాలా సామాన్యవిషయాలు కదా!

◆ ◆ ◆ ◆ ◆ ◆

కమల కళ్ళజోడు ఒకసారితీసి తుడిచి పెట్టుకుని పిట్టగోడ ఆనుకుని నిలబడి క్రిందికి చూసింది. అది మూడో అంతస్తులో అయిదో వాటా. ఎత్తునుంచి చూస్తే ఆ మేడ గుర్రపునాడా ఆకారంలో చిత్రంగా కనిపిస్తుంది. క్రింది అంతస్తులో అద్దెకుంటున్న వారు పొద్దున్న లేచింది మొదలు హడావిడిగా పనులు చేసుకుంటూ అటూ ఇటూ తిరుగుతూ ఉంటారు. పక్కగా మొదటి అంతస్థులో మొదటివాటలో అద్దెకుంటున్న కాలేజి విద్యార్థి మాత్రం నెమ్మదిగా నిద్రలేచి గుమ్మంముందు పక్కా అరగంటసేపు నోట్లో బ్రష్‌తో నిలబడి మాటామాటికీ పైకి కమలవంక చూస్తున్నాడు. ఇతర వాటాలో వారు కొందరు పిట్టగోడమీద రంగు రంగుల బట్టలు ఆరేసుకుంటున్నారు. ఆ నల్లని మాసికలచీరె ఆరేసిఉన్న భాగంలో అరవదంపతులు వున్నారు. వారికి అయిదేళ్ళ పిల్ల. రెండు నెలలు క్రిందట ఆ పిల్లకు అకస్మాత్తుగా జబ్బుచేసింది. రాత్రివేళ ఊపిరాడక మెలికలు తిరిగిపోవడం మొదలు పెట్టింది. ఆ పిల్ల తండ్రి రైల్వేషెడ్‌లో పనిచేస్తూ వుంటాడు. అతడు అప్పటికప్పుడు హడావిడిగా డాక్టరును పిలుచుకు వద్దామని పరుగెత్తుకుపోతే డాక్టరు దర్శనంకూడా కాలేదు. ఇంటికిపోతే క్లబ్బులో ఉన్నాడన్నారు. క్లబ్బుకుపోతే ఇంటికి వెళ్ళాడన్నారు.

అతడు క్లబ్బుకూ డాక్టరు ఇంటికి రెండు మూడుసార్లు తిరిగి దీనంగా యింటికి వచ్చాడు. అప్పుడా పిల్ల తల్లి ఏడుపు ప్రారంభించింది. చుట్టుపక్కల వాటాల్లో లైట్లు వెలిగాయి. ఏమిటేమిటంటూ కొందరు చేరారు. అప్పుడు కమల అన్నయ్య దాసు సెలవుమీద వచ్చి ఉన్నాడు. అతడంతా విని ఏవో హోమియోమాత్రలు తీసుకువెళ్ళి ఆ పిల్లచేత మింగించి ధైర్యంచెప్పి వచ్చాడు.మళ్ళీ అంతా సద్దుమణిగింది. పక్కవాటాల్లో లైట్లు ఆరిపోయాయి. తెల్లవారేసరికి ఆ పిల్లకు నెమ్మదించింది. దాసు మళ్ళీ అదేమందు ఒక డోసు వాడి, "ఇక ఏమీ ఫరవాలేదు. పొమ్మ" న్నాడు.

కమలకు అన్నయ్యను తలుచుకుంటే కన్నీళ్లు పొంగివచ్చాయి. ఆమె గొంతు సర్దుకుంటూ జోడుతీసి, పమిటకొంగుతో కళ్ళు తుడుచుకుంటూ అలాగే నిలబడింది. తర్వాత క్రింద కేకలు వినిపిస్తే కళ్ళజోడు తగిలించుకుని క్రిందికి చూసింది. అక్కడ ఒక వాటాముందు నిలబడి పాలవాడు కేకలు పెడుతున్నాడు. అరిచి అరిచి చివరకు "అంత ఇయ్యలేనోళ్ళు పాలెందుకు పోయించుకున్నారు? ఇదేం మీ ముల్లె అనుకున్నారా? రేపు నా డబ్బియ్యకపోతే మర్యాద్దక్కదు..." అని బెదిరించి వెళ్ళిపోయాడు. ఆ వాటాలో కాపురం ఉంటున్న వ్యక్తి కోమటి దుకాణంలో పద్దులు రాస్తూ వుంటాడు. ఆయనకు జీతం రావడానికి నెలలో ఫలానా తేది అని గడువు ఏమీ లేదు. షావుకారు తనదగ్గర డబ్బు పుష్కలంగా ఉన్నదనిపించినప్పుడు ఆ డెబ్బయి రూపాయలూ పారేస్తాడు. అది వచ్చే దాకా అతడు

అడగకూడదు. అందువల్ల పాలవాడేకాదు. బొగ్గులవాడూ, కిరణాకొట్టువాడూ ఇంకా యితరులూ అందరూ మాటిమాటికీ అతన్ని "మర్యాద దక్కదు" అని బెదిరించడం ఎన్నో సార్లు జరిగింది. ఆయన మర్యాద యింకా ఉందో, ఊడిపోయిందో అది తేలవలసిన విషయం.

కమల కుడిచేతి చూపుడువ్రేలితో పిట్టగోడ మీద తాళంవేస్తూ అలాగే నిలబడింది. ఎదురుగా సూర్యుడు తీక్షణంగా ప్రకాశిస్తున్నాడు. ఎండలో చురుచురుకుపాలు హెచ్చుతున్నది. క్రిందివాటాలలో ఆఫీసులకు పోయేవారూ, కచేరీలకు పోయేవారూ ఆదుర్దాపడుతున్నారప్పుడే. వారి భార్యలు ఉన్నవేవో వండి పడెయ్యడానికి తొందర పడుతున్నారు. ఈ పక్కవాటాలో ఉన్న శాంతమ్మ ఇంకా ఇవతలికిరాలేదు. ఆమె లేచీలేవగానే మడికట్టుకుని వంట పూర్తిచేసి ఆ గుమ్మం ముందున్న చిన్న తులసికోటలో నీళ్ళుపోసి తర్వాత భర్తకు అన్నం వడ్డిస్తుంది. ఆయన ఈ లోపల పదిసార్లు కేకలు పెడతాడు. ఉండి ఉండి అందరికీ వినబడేట్టుగా "నేనయిదుమైళ్ళుపోవాలి... నువ్వు నత్తనడకలు నడిస్తే అవతల ఊరుకునే వాళ్ళెవరూలేరు. కానియ్ కానియ్" అంటూ వుంటాడు. ఆమె "వొస్తున్నా వొస్తున్నా" అంటూ పనిచేసుకుంటూ వుంటుంది.

కమల కెదురుగా ఆకాశంలో గాలినంతటినీ కూడలాక్కుంటూ ప్రపంచంమీదికి చురుకైన వేడి కిరణాలను వదలుతున్న సూర్యబింబం నిప్పులుచెరిగే పళ్లెంలావుంది. ఒకటో రెండో పక్షులు అప్పుడే నీరసంగా ఎగురుతూ పోతున్నాయి. దూరంగా అన్నీ యిళ్ళు...తేనెతుట్టెల వంటి యిళ్ళు...వాటిలో ఇరుకు ఇరుగ్గావున్న వాటాలు...ఆ వాటాలలో ఇరుక్కుని కాలం గడుపుతున్న మనుషులు...ఆ పేట పక్కనే అవతల కనుచూపుమేర అంతటా పాకలు...భూదేవి శరీరం మీద వ్రణాలవలె అసహ్యంగా మురికిగా ఉన్న చిన్న చిన్న పాకలు...వాటిలోనూ లెక్కకు మిక్కిలిగా జనం...

కమల అలా చూస్తూ వుండగానే ఒక నల్లని బుల్లి కారు వచ్చి ఆ మేడముందు ఆగింది. అందులోనుంచి ఆ యింటి యజమాని ప్రభాకరం తెల్లని దుస్తులలో దిగి వచ్చాడు. అతని ఎడమ చేతిలో సిగరెట్టు పెట్టె, అగ్గిపెట్టె ఉన్నాయి. ఆ చేతి వ్రేళ్ళకు ధగధగ రెండు రాళ్ళ ఉంగరాలున్నాయి.

కమల కొంచెం కంగారుపడింది. జాగ్రత్తగా చూసింది. అంతలో పమిట సర్దుకుని "ఇటే వస్తున్నాడు..." అనుకున్నది. తర్వాత గబగబ లోపలికి వెళ్ళి ఎడమవైపున్న ఒక్కగానొక్క బుల్లికిటికీ పక్కన నిలబడి చతురస్రంగా కనిపిస్తున్న ఆకాశం వంక చూస్తూ వుండిపోయింది.

అంతలో గుమ్మం దగ్గర అడుగుల చప్పుడయింది. అతడు "కమలాదేవిగారూ!" అని పిలుస్తూ చెప్పులు విడిచి లోపలికి రానేవచ్చాడు. కమల పమిట కొంగులో ఉన్న కుట్టు పైకి కనబడకుండా భుజాలమీదుగా కప్పుకుని అతనివైపు తిరిగి "రండి రండి" అన్నది.

అతడు రెండడుగులు ముందుకువేసి మూలగా మంచంలో పడుకుని ఉన్న ముసలాయన వంక చూస్తూ "ఇంకా మీ నాన్నగారికి అలాగే వుందా?" అని అడిగాడు.

కమల తలవూపి "అలాగే వుందండీ...ఏమీ మార్పులేదు. రాత్రి అంతా గాలిలేక ఊపిరాడక చాలా బాధపడ్డారు. ఇందాకే నిద్రపట్టింది..." అన్నది.

ప్రభాకారం ముసలాయన వంక మళ్ళీ చూశాడు. ముసలాయన బరువుగా గాలి పీలుస్తున్నాడు. బాగా చిక్కిపోయి ఎముకల గూడులా ఉన్నాడు. గడ్డం మాసిపోయి నల్లగా, అసహ్యంగా ఉంది.

ప్రభాకరం "సరే! మిమ్మల్ని అద్దె అడిగేందుకు వచ్చాను. ఇప్పటికీ మూడ నెలల అద్దె బకాయి ఉంది. మీ అన్నయ్య ఇంకా డబ్బు పంపలేదా?" అని అడిగాడు.

కమల నెమ్మదిగా "లేదండీ....అక్కడ ఏ హడావిడిలో ఉన్నాడో ఏమో మరి!" అన్నది.

"మంచిది...అతని దగ్గరనుంచీ డబ్బు రాగానే మూడునెలల అద్దె యిచ్చేయండి. ఎప్పటి కప్పుడు జమకట్టకపోతే ముందు ముందు ఇవ్వడం కష్టం..." అంటూ అతడు గుమ్మంవైపు నడుస్తూ ఆగి "అన్నట్టు డబ్బు రాగానే ఎవరైనా డాక్టర్ని పిలిచి మీనాన్నగారికి మంచి మందు యిప్పించండి. జబ్బు ముదిరితే ప్రమాదం..." అన్నాడు. అతర్వాత గ్లాస్కో లాల్చీ జేబులలో చేతులుంచుకుని "నేనిక వస్తాను.." అని గుమ్మంముందు ఆగి ఆమెవంక ఒక్కక్షణం కన్నార్పకుండా చూశాడు. అంతలో చూపులు తిప్పుకుని గబగబ నడిచి వెళ్ళిపోయాడు.

కమల ఒక్కసారి నిట్టూర్చి తండ్రివంక చూసింది. చూస్తున్న కొద్దీ ఆమెకు దిగులూ, దుఃఖమూ పొంగివచ్చాయి. ఆయన జీవితమంతా చాకిరీచేశాడు. రకరకాల చిన్న చిన్న ఉద్యోగాల్లో సంవత్సరాల తరబడి నడుం వంచి పనిచేశాడు. చివరకాయనకు, ఏమీ మిగలలేదు. రిటైరయ్యేనాటికి ఒక జబ్బూ, దానివల్ల బలహీనతా, మానసిక చింతా, ఇవి మాత్రం మిగిలాయి ఆయనకు. పెద్దకొడుకు దాసూ, కూతురు కమలా యిద్దరూ రెండు కళ్ళు...."వారిని కన్నానేగాని సుఖం యివ్వలేకపోయానే" అని ఆయన చాలా సార్లు దిగులుపడ్డాడు. దాసుకు ఎస్సెల్సీ వరకూ చదువు చెప్పించేసరికి ఆయన శక్తి సన్న గిల్లింది. కమలకు చదువంటే యిష్టం...చదువుకున్నవారినీ, చదువుకుంటున్నవారినీ చూస్తే గౌరవం...ఆమె ఫోర్తుఫారం వరకూ చదివి తరువాత ఆపేయవలసి వచ్చింది. ఇంట్లో పనీ పాటా చేసుకుంటూ కాలం గడపవలసి వచ్చింది. దాసు కొన్నాళ్ళు ఏవో చిన్న చిన్న ఉద్యోగాల కోసం ప్రయత్నాలు చేసి ఫలించక విసిగిపోయి ఒక రోజున తెగించి ఉత్తరదేశం పారిపోయాడు. కొన్ని వందల మైళ్ళ దూరంలో ఒక ఫ్యాక్టరీలో స్థిరపడి ఇంటికి ఉత్తరం వ్రాశాడు. ఇటీవలే సెలవు మీద వచ్చి వెళ్ళాడు కూడా.

కమల అలాగే గుమ్మానికానుకుని నిలబడి అన్నను గుర్తు చేసుకుని కళ్ళు తుడుచుకున్నది. అంతలో ఆమెకు చిరాకు కలిగింది. "ఈ కళ్ళ జోడొకటి! అసహ్యంగా... అయినా ఈ వయస్సులో తనకీ కళ్ళజోడేమిటి ఖర్మకాకపోతే! ఛాఛా" అనుకున్నది.

మంచంలో ముసలాయన అంతలో కళ్ళు తెరిచాడు. నెమ్మదిగా కమలను పిలిచాడు. ఆమె త్వర త్వరగా తండ్రి దగ్గరికి వెళ్ళి "లేచావా నాన్నా? మొహం కడుక్కో. కాసిని పాలు తాగుదువుగాని" అన్నది.

ఆయన ఏమీ మాట్లాడకుండా కళ్ళు పెద్దవి చేసుకుని కూతురివైపు చూస్తూ లేచాడు. తర్వాత ఆమె సాయంతో అవతల చిన్న గదిలోకి వెళ్ళి తూము దగ్గిర మొహం కడుక్కున్నాడు తర్వాత మళ్ళీ కూతురి భుజాల మీద చేతులు వేసి నడిచి వచ్చి మంచంలో కూర్చున్నాడు.

కమల పాలుతెచ్చి యిచ్చింది. అవి నెమ్మదిగా తాగుతూ చిత్రంగా చూసి "ఇప్పుడొక కల వచ్చిందే అమ్మాయ్!" అన్నాడు.

కమల "ఏమిటి నాన్నా అది?" అని అడిగింది.

"నేను సముద్రం ప్రక్కన నడిచిపోతున్నాను. అక్కడెవరూ లేరు. కొంచెం సేపు పరుగెత్తాను. అంతలో నాకు రెక్కలొచ్చాయి. ఇక ఎగిరిపోవడం మొదలు పెట్టాను. అప్పుడు నా వంక నేను చూసుకుంటే కాకినై పోయాను, ఇతర కాకుల్లో చేరిపోయాను" అని నెమ్మదిగా చెప్పాడాయన.

పాలు తాగడం ముగించి ఎందుకో కళ్ళు పెద్దవి చేసుకుని చిత్రంగా పైకి చూస్తూ పడుకున్నాడు. కాస్సేపట్లోనే ఆయనకు మళ్ళీ కునుకుపట్టినట్టున్నది. కదలకుండా పడుకుండిపోయాడు.

కమల పక్క గదిలోకి వెళ్ళి ఏదో డబ్బాలో తాను రెండు రోజుల క్రితం దాచిన ఒక ఉత్తరం యివతలికి తీసింది. అయితే ఆమె దాన్ని చదవలేదు. అసలు విప్పలేదు. ఒక్క క్షణం ఆగి దాన్ని అలాగే వుంచేసి యివతలికి వచ్చింది. చెమ్మగిల్లిన కనులలో చూస్తే కిటికీలోంచి కనిపిస్తున్న ఆకాశ భాగంలో రెండు పక్షులు జోరుగా ఎగిరిపోతూ కనిపించాయి.

♦ ♦ ♦ ♦ ♦ ♦

మధ్యాహ్నం పన్నెండు గంటలు దాటింది. ఎండ... ఎండ... ఎండ... సమస్త చరాచర ప్రపంచాన్నీ ఎర్రగా కాలిన పెనంమీద ఉంచి నట్టుంది. వేడిగాలి కొద్దిసేపు వీస్తుంది. అంతలోనే అలిగి గంటలతరబడి కదలడం మానేస్తుంది. సూర్య బింబం బాగా కాలిన ఉక్కు ముద్దవలె నిప్పులు కురిపిస్తూ సమస్త జీవరాసులుచేతా "ఉస్సుర"ని పిస్తుంది.

కమల అతి ప్రయత్నం మీద తండ్రిని లేవదీసి కూర్చోబెట్టింది. ఆయన దాదాపు నిద్రపోతూనే కూర్చున్నాడు. ఆమె నెమ్మదిగా స్పూనుతో బియ్యపు జావ తాగించింది. తర్వాత మొహం తుడిచి మళ్ళీ పడుకో బెట్టింది. ఆయన ఒక్కక్షణం ఆగి "గాలి...గాలి" అన్నాడు.

అవును గాలి లేదు. ప్రపంచంలో ఎక్కడా లేదు. సంపన్నులు డబ్బు పెట్టి కొనుక్కుంటే దొరుకుతుందో లేదో ఆమెకు తెలీదు.

ఆయన మళ్ళీ "గాలి గాలి..." అన్నాడు.

కమల ఒక్క క్షణం ఆలోచించింది. నిజమే. గాలి కావాలి. ఆమెకు అకస్మాత్తుగా గుర్చు వచ్చింది. పై అంతస్తులో మధ్య ఒక వాటాలో అద్దెకుంటున్న ఒక రైల్వే గుమాస్తా యింట్లో ఒక పాతఫ్యాను ఉంది. దాన్ని కమల కొద్ది రోజుల క్రిందట చూసింది. ఎప్పుడో ఏదో వస్తువు బదులు కావలసి వచ్చి అక్కడికి వెళ్ళగా మూడో గదిలో స్టూలు మీద ఆ ఫ్యాను చుట్టలు చుట్టుకొని, తలఎత్తిన పెద్ద పాములా వుండి గిర్రున తిరుగుతున్నది. కమల ఇప్పుడు ఆలోచించింది. ఒక్కసారి వెళ్ళి వారిని ప్రాధేయపడితే?

ఆమె నెమ్మదిగా లేచి జాకెట్టు చిరుగు కనిపించకుండా పమిట కొంగు భుజాల చుట్టూ కప్పుకొని, తలుపు దగ్గరకు లాగి బయలుదేరింది. వేడిగా నిప్పులు పరచినట్టున్న సన్నని వరండాలో నడిచింది. నెమ్మదిగా మెట్లెక్కి పై అంతస్తుకు వెళ్ళింది.

ఆ గుమాస్తా యింట్లో లేడు.ఆయన భార్య పిల్లలిద్దర్నీ చాపమీద పడుకోబెట్టి తాను ప్రక్కనే ఏదో పత్రిక చదువుకుంటూ పడుకుని వుంది. ఆ పక్కనే మూలగా ఫ్యాను తిరుగుతున్నది.

కమల గుమ్మం బయట నిలబడి ఒక్క క్షణం ఆలోచించింది. అంతలో ఆమె తలయెత్తి చూసి "ఎవరది?" అని అడిగింది.

కమల నవ్వుతూ "నేనే అక్కయ్యగారూ?" అంటూ లోపలికి వచ్చింది.

ఆమె లేచి కూర్చుని "రా, అమ్మా" అన్నది. కాని ఆమె మొహంలో ప్రసన్నత లేదు. కమల లోపలికి వెళ్ళి కూర్చున్న తరువాత కూడా ఆమె మళ్ళీ చదువుకుంటూనే ఉండిపోయింది తప్ప ఏమీ మాట్లాడలేదు.

కమల నెమ్మదిగా "అక్కయ్యగారూ? మా నాన్నగారు చాలా బాధ పడుతున్నారు..." అన్నది.

ఆమె తల ఎత్తి చప్పరించి జాలిగా "పాపం. పెద్ద వయస్సు. అందులోనూ నిప్పులు చెరిగే ఎండాకాలం..." అన్నది.

కమల "అవునండీ. ఊపిరాడక, గాలిలేక చాలా బాధపడుతున్నాడు. ఒక్కసారి..." అంటూ ఒక్క క్షణం ఆగింది.

ఆమె కమల వైపు చూసింది.

కమల తల వంచుకుని "ఏమీ అనుకోకపోతే, ఒక్కసారి మీ ఫ్యాను యివ్వండి. ఒక్క గంటసేపు వుంచుకుని మళ్ళీ తెచ్చి యిచ్చేస్తాను" అన్నది.

ఆమె ఒక్క క్షణం ఏమీ మాట్లాడలేదు. తర్వాత "చూడమ్మా! వీళ్ళు పసిపిల్లలు. నిద్రపోతున్నారు. ఇప్పుడెలా చెప్పు..." అన్నది. తర్వాత యిద్దరూ కాసేపు ఏమీ మాట్లాడలేదు.

కమల లేచింది. పమిట కొంగుతో నుదురు తుడుచుకుని విసురుకుంటూ "సరే...వస్తానండీ..." అని చెప్పి తన వాటాలోకి వచ్చేసింది. తండ్రి వంక చూస్తే ఆయన బరువుగా గాలి పీలుస్తూ పడుకుని వున్నాడు.

కమల కిటికీ పక్కనే కూర్చున్నది. ఆకాశంలోకి చూస్తూ గోడకానుకుని కూర్చున్నది. కాస్సేపట్లో కళ్లు మూతలు పడ్డాయి. అంతలో చక్కని పంచరంగుల కల ప్రారంభమైంది.

...తమది ఒక పల్లెటూరు...అక్కడ అసలే ఇళ్ళు తక్కువ. ఉన్నవన్నీ దూరదూరంగా వున్నాయి. తమ యిల్లు ఊరికొసన కొబ్బరి చెట్ల మధ్యలో వుంది....ఆ వూరికి అరమైలు దూరంలోనే సముద్రం...ఎల్లప్పుడూ హోరుమని మోత వినిపిస్తూ వుంటుంది. సముద్రం మీద నించీ ఎల్లప్పుడూ విసురుగా బాణ వేగంతో గాలి వీస్తూ వుంటుంది. ఎప్పుడూ రాత్రీ పగలూ అని లేకుండా ఒకటే గాలి...తాను తలంటి నీళ్ళు పోసుకుని అలా బయటకి వెళ్ళింది. విసురుగా వీస్తున్న గాలికి ఆమె తల వెంట్రుకలు చెల్లాచెదురై పోయి మాటి మాటికీ మొహానికీ, కళ్ళకూ అడ్డం పడుతున్నాయి. ఆమె చిరాకుతో వెంట్రుకలను పైకి తోసుకుంటూ 'ఛ... వెధవ గాలి...' అని విసుక్కుంటున్నది.

అంతలో ఆమె ఉలిక్కిపడి లేచింది. ఆమె పంచరంగుల కల చెదిరిపోయింది. తండ్రి బాధగా మూలుగుతూ పిలుస్తున్నాడు. ఆమె తండ్రి దగ్గరికి వెళ్ళి కూర్చున్నది.

ఆయన ఆయాసంతో "గాలి ఆడటం లేదమ్మా...తలుపులుతియ్..." అన్నాడు.

"తలుపులన్నీ తీసేవున్నాయి నాన్నా" అన్నదామె.

ఆయన 'అలాగా' అని ఒక్క క్షణం ఆగి "అన్నయ్య దగ్గర నించి ఇవాళ కూడా డబ్బు రాలేదా అమ్మా!" అని అడిగాడు.

ఆమె కళ్ళు తిప్పుకుని "లేదు నాన్నా? వాడక్కడ ఏ తొందర పనుల్లో ఉన్నాడో ఏమో?" అన్నది.

ఆయన మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు. అంతలోనే నిద్రపట్టిందో లేక మగత కమ్మిందో తెలీదు. కళ్ళు మూసుకుని పడుకుండిపోయాడు. ఆమె కాసేపు మెల్లగా విసురుతూ కూర్చున్నది. కాని అలా లాభంలేదు. అలా వచ్చినగాలి వేడిగా మరింత వేడిగా ఉంటుందే తప్ప దానివల్ల సుఖం లేదు.

ఆమె అంతలో లేచి లోపలి గదిలోకి వెళ్ళి మళ్ళీ ఆ ఉత్తరం చూసింది. అంతలో ఆమెకు కళ్ళవెంట నీళ్ళు పొంగివచ్చాయి. బావురుమని పెద్దగా ఏడిస్తే బాగుండునని పించింది. కాని అతి ప్రయత్నం మీద ఏడుపు ఆపుకుని కళ్ళు తుడుచుకుని ఉత్తరం జాకెట్టులో దాచుకుని యివతలికి వచ్చింది. ఈ రాత్రికి ముందు గదిలో ఫ్యాను ఉండాలి. లేకపోతే తండ్రి స్థితి ఎంతగా విషమిస్తుందో తనకు తెలుసు. ఆయన తానెంత ఓపికగా విసురుతూ కూర్చున్నా ఊపిరాడక తన్నుకుంటాడు. ఫ్యానువల్ల వచ్చే చల్లని తగుమాత్రపు గాలి ఈ రాత్రికి ఆయన అనుభవించాలి.

కమల క్రిందికి చూసింది. మెయిన్‌గేటులోనుంచి బుల్లి విమానంలాంటి ఆ కారు మళ్ళీ రావడం ఆమెకు కనిపించింది. అందులో నుంచి ప్రభాకరం దిగివచ్చి క్రింద ఎవరితోనో ఏదో మాట చెప్పి మళ్ళీ అంతలోనే వెళ్ళబోతున్నాడు. అంతలో అతడు పైకి చూశాడు. కమల అప్రయత్నంగా చేయివూపి అతన్ని పైకి రమ్మన్ని సైగచేసింది. అతడు ఒక్కక్షణం ఆలోచించి నెమ్మదిగా నడిచి పైకి వచ్చాడు. అతడు పైకి రావడానికి చాల సేపు పట్టింది. అంతసేపూ ఆమె గుమ్మంముందు నిలబడి చీరమీద తెల్లదారం కుట్లు కనిపించకుండానూ, జాగ్రత్తగా సర్దుకున్నది. తర్వాత ఆ చిన్న వరండాలో ముందుకు నడిచి వస్తున్న అతనివంక చూసింది. చిరునవ్వు నవ్వింది.

అతడు దగ్గరకు వస్తూనే "ఏమిటండి పిలిచారు? డబ్బు వచ్చిందా?" అని అడిగాడు.

కమల తల అడ్డంగా వూపి" లేదండి...ఇవాళ తప్పకుండా వస్తుందనుకున్నాను. అలా అని ఇదిగో ఉత్తరంకూడా వచ్చింది. రాగానే మీ డబ్బు మీకు పువ్వుల్లోపెట్టి మరీ యిచ్చేస్తానుగా..." అన్నది.

అతడు "సరే" అన్నాడు.

కమల మళ్ళీ "ఏమండీ! ఇక్కడ ఒక్కదాన్నీ...ఏమీ తోచడం లేదు...నాకు మీ యిల్లు చూడాలని వుంది. రమ్మంటారా?" అన్నది.

ప్రభాకరం కొద్దిగా ఆశ్చర్యంగా చూసి అంతలోనే తేరుకుని "దానికేం భాగ్యం? అలాగేరండి...యిప్పుడే వెడదామా?" అని అడిగాడు.

"ఓ...ఇప్పుడే వెడదాం...ఇదిగో, తలుపు దగ్గరికి వేసివస్తాను." అంటూ ఆమె గుమ్మంలో నిలబడి ఒక్కసారి తండ్రివంక చూసింది. ఆయన పడుకున్న పద్ధతిలో

మార్పేమీలేదు. ఇవాళ పొద్దుగుంకే వేళకు ఆయన మంచం పక్కనే చల్లని గాలిని తెరలు తెరలుగా తిప్పుతూ చక్కని ఫ్యాను ఉంటుంది. ఆయన రాత్రి హాయిగా నిద్రపోతాడు. వీలయితే చక్కని కలలుకూడా కంటాడు.

కమల తలుపు దగ్గరికి లాగి "పదండి" అంటూ అతని వెంటనడిచింది. ఆమెకు తెలుసు. ప్రభాకరం యింట్లో అతడు తప్ప మరెవరూ ఉండరు. అతడు మంచివాడు కాదని కొందరనుకోగా ఆమెకూడా విన్నది. అయినా ఆమె ఏ మాత్రమూ తొణకకుండా అతనివెంట నడిచి వచ్చి కారులో ఎక్కింది. అతడు స్టీరింగ్ ముందు కూర్చుని కారును వేగంగా పోనిచ్చాడు. ఆమె కారు కదలిక వల్ల వచ్చిన గాలి తాకిడిలోని ఆనందాన్ని అనుభవిస్తూ ఒక్క క్షణం కళ్ళు మూసుకున్నది.

ప్రభాకరం కారు పోనిస్తూ "మీ నాన్నగారికి పాపం, ఒంట్లో సుస్తీ తగ్గలేదనుకుంటానే... ఎవరైనా మంచి డాక్టర్ని పిలిచి..." అన్నాడు.

కమల "నవ్వి పెద్దతనం కదండి మరి... చెయ్యి నొచ్చినా, కాలు నొచ్చినా తొందరగా తగ్గదు..." అన్నది.

అతడు మరేమీ మాట్లాడలేదు. ఆమె మాత్రం కాస్సేపాగి "అబ్బబ్బ ఏమి ఎండ! ఈ సంవత్సరం మరీ దారుణంగా వుంది. దానికి తోడు గాలి కూడా సమ్మె చేసినట్లు బిగించింది" అన్నది.

అతడు తల వూపి "అవునవును" అని ఊరుకున్నాడు.

ఆమె మళ్ళీ "ఏమిటో, నాకీ వాతావరణం ఎప్పుడూ అలవాటు లేదు. చిన్నప్పటినుంచీ మా ఊళ్ళో హాయిగా పెరిగాను. అన్నట్టు మా ఊరు సంగతి మీకు తెలీదుకదండీ... మాది ఎంచక్కని పల్లెటూరు... ప్రశాంతంగా ఉంటుంది. ఊరికి దగ్గరలోనే సముద్రం... ఎంత ఎండాకాలంలో అయినా కమ్మన్నిగాలి... ఒక్కొక్కప్పుడు విసుగుకూడాపుట్టేది ఒకటే రొదచేస్తూ హోరుమని గాలివీస్తూంటేకూడా బాధేకదండి మరి... ఇప్పుడేమో ఇక్కడ గాలి ఆడక బాధపడుతున్నాం... ఇప్పటికిప్పుడు మా ఊళ్ళో వుంటే ఎంత బావుంటుందో..." అన్నది.

ఆమె పుట్టింది పెద్దపట్నంలోని ఒక మూరుమూల ఇరుకు పేటలో అద్దె యింట్లో. పెరిగింది కూడా అటువంటి ఇరుకుపేటలోని అద్దె వాటాలలోనే. ఆమె ఎన్నడూ యింతవరకూ ఒక ప్రశాంతమైన పల్లెటూరును చూడనైనా లేదు.

ప్రభాకారం కారు మలుపు తిప్పుతూ "మీ అన్నయ్య ఏం చేస్తూవుంటాడన్నారూ!" అని అడిగాడు.

ఆమె "ఇంతవరకూ నేనేమీ అనలేదే." అని నవ్వింది. అతడు కూడా నవ్వి "పోనీ యిప్పుడు చెప్పండి..." అన్నాడు.

ఆమె, ఉత్తరదేశంలో ఏదో ఊరుపేరు చెప్పి "అక్కడ టాంకులు... విమానాలు తయారు చేస్తూంటారు చూశారు! పెద్ద ఫ్యాక్టరీ... అందులో పని..." అన్నది.

అతడు మరేమీ మాట్లాడకుండా కారును గ్యారేజిలోకి పోనిచ్చి, ఆపాడు. ఆమె దిగి యివతలికి వచ్చి చూసింది చక్కని చిన్న యిల్లు... అందంగావుంది... ముందు రకరకాల మొక్కలున్నాయి.

అతడు "రండి..." అంటూ వరండాలోకి వెళ్ళి తలుపు తాళం తీసి పక్కగది చూపిస్తూ "లోపలకూర్చోండి...ఇప్పుడే వస్తాను..." అని మరో గదిలోకి వెళ్ళిపోయాడు.

కమల తలుపుతోసింది. అది స్ప్రింగ్ తలుపు. ఆమె లోపలికి వెళ్ళగానే దానంతట అదే మూసుకున్నది, లోపల చల్లగా అతి చల్లగా వుంది. కిటికీలో ఏదో పెట్టెవంటి మెషినులోనిచి చల్లనిగాలి హాయిగా వీస్తున్నది. పైన ఫ్యాను తిరుగుతున్నది. ప్రభాకరం కొద్దిసేపటి క్రిందట ఫ్యాను కూడా ఆపకుండా ఉన్నపట్టున బయలుదేరి ఉండాలి...కిటికీ పక్కన దోమతెరకట్టిన మంచం... దానిమీద మెత్తనిపరుపు...రెండు మూడుదిండ్లు... మంచంపక్కనే చక్కని నగషిచెక్కబడిన ఖరీదైన అందాల టీపాయ్... పక్కన కుర్చీలు... టీపాయ్ మీద ఏవో పుస్తకాలు, మరో చక్కని బల్లమీద టేబిల్ ఫ్యాను, అది మాత్రం తిరగడం లేదు.

కమల దాని వంకనే కన్నార్పకుండా చూసింది. ఆకలి గొన్న కళ్ళతో చూసింది. దాన్ని అప్పటికప్పుడే స్వంతం చేసుకోవాలన్నంత ఆశగా చూసింది.

ప్రభాకరం దుస్తులు మార్చుకుని వచ్చాడు. వస్తూనే "ఇదండి మాయిల్లు. కాదు, కాదు, నా యిల్లు!" అన్నాడు. తర్వాత "అరె! మీరలా నిలబడేవున్నారేం? కూర్చోండి..." అన్నాడు. "మంచినీళ్ళు కావాలా?" అని అడిగాడు. ఆమె కావాలని తల వూపగానే కిటికీలోని అందాల కూజాలోంచి చల్లని మంచి నీళ్ళు తెచ్చి యిచ్చాడు. ఆ గ్లాసు అందుకుంటూ వుండగా ఆమె చేతివ్రేళ్ళు అతని వ్రేళ్ళకు తగిలాయి. ఆమె గ్లాసు అందుకొని గడగడ త్రాగేసి సోఫాలో వెనక్కువాలి, 'అమ్మయ్య' అనుకున్నది.

తర్వాత అతని పుస్తకాలు షెల్ఫ్‌వంకచూసి లేచివెళ్ళి పరీక్షగా అన్ని పుస్తకాలు చూసింది. ప్రభాకరం ఆమెవంకనే కన్నార్పకుండా చూస్తూ మంచం మీద దిండ్లు ఆనుకుని కూర్చున్నాడు.

ఆమె "ఆరె, మీదగ్గర మంచి మంచి పుస్తకాలు ఉన్నాయే... ఇదుగో ఈ పుస్తకం నేనూ చదివాను. ఎక్కడబ్బా? అవును మావూళ్ళో పంచలో కూర్చుని చదువుతూంటే హోరు గాలికి పేజీలు నిలవక చిరాకు పుట్టింది కూడా... నాకు చాలా నచ్చిందీ పుస్తకం..."అన్నది.

తర్వాత కుర్చీలో కూర్చుని తమ వూరిని గురించి చాలాసేపు మాట్లాడింది. అటువంటి ఊరు పృథ్విలో ఎక్కడా వుండదన్నది... అక్కడ కృత్రిమ వాతావరణం అసలు లేదన్నది. ఎంత ఎండాకాలం అయినా సరే ఆవూరు ఊరంతా ఎయిర్ కండిషన్డ్ గదిలా వుంటుందన్నది. ఫానులూ పాడు ఏవీ అక్కర్లేదన్నది. సాయంకాలం పూట అలా సముద్రపు ఒడ్డుకు వెళ్ళి కూర్చుంటే జీవితంలో ఇంకేమీ కావాలని పించదు అన్నది.

ప్రభాకరం నిశ్శబ్దంగా కూర్చుని అంతా విన్నాడు.

అంతలో ఆమె లేచి "సరే... నే నొచ్చి చాలాసేపయింది... వెళ్తానిక..." అన్నది.

అతడు వాచీ చూసుకుని "నాలుగేకదండీ అయింది? కాస్సేపు కూర్చోండి... కొంచెం చల్లబడ్డ తర్వాత వెళ్ళవచ్చు..." అన్నాడు.

తర్వాత అతడు కాఫీ తయారు చెయ్యబోయాడు. ఆమె నడుంబిగించి "అదేమిటండి, మీరు కాఫీ చెయ్యడం ఏమీ బాగులేదు. ఇవాళ నాచేతి కాఫీ రుచి చూడండి..." అన్నది తాను స్టవ్‌ముందు కూర్చుంటూ. ప్రభాకరం కావలసినవన్నీ అక్కడ అమర్చగా ఆమె కాఫీ పెట్టింది. అంతసేపూ ఏదో మాట్లాడుతూనే వుంది.

ప్రభాకరం ఆమె వంకనే చూస్తూ ఉండిపోయాడు. "ఈ పిల్లకు కళ్ళజోడు లేకపోతే ఎంత బాగుండును. పెద్ద పెద్ద ఆకళ్ళకు అసహ్యంగా జోడేమిటి? ఒకవేళ ఉన్నా చక్కని అందమైన ఫ్రేం ఉండాలిగాని ఇలా చవకబారు నల్లని ఫ్రేము మరీ ఘోరంగా ఉంది. ఆ

నల్ల చీరె పాతదైపోయింది. అక్కడక్కడ కుట్లు కనిపిస్తున్నాయి. జాకెట్టు కూడా భుజం మీద చిరిగి వుండాలి. అలా పమిటా నిండుగా కప్పుకోవడంలో అర్థం అదే..." అనుకున్నాడు.

ఆమె కాఫీ కప్పు అతనికి అందించి తానొక కప్పు తీసుకుని కూర్చుని "చెప్పండి... ఎలా వుంది కాఫీ?" అని అడిగింది.

"అద్భుతంగా ఉంది..." అన్నాడు ప్రభాకరం.

ఆమె కబుర్లు చెబుతూనే కాఫీ తాగింది. తర్వాత కూర్చున్నదల్లా లేచి గదిలో అటూ యిటూ పచార్లు చేస్తూ తమ పల్లెటూళ్ళో అన్నయ్యా, తనూ చిన్నప్పుడు తోటల్లోనూ, పొలాల్లోనూ ఆడుకున్న ఆటలను గురించి చెప్పింది. ఆ వాతావరణం, ఆ గాలీ, ఆ సముద్రం, అన్నిటిని గురించీ మళ్ళీమళ్ళీ చెప్పింది. అప్పుడప్పుడు తలవెనక్కువేసి చక్కగా నవ్వింది.

ప్రభాకరం అలాగే కూర్చుని అంతా విన్నాడు. బయట చీకటిపడుతున్నది. అతడు లేచి లైటువేశాడు. ఆమె ఒక్కసారిగా ఉలిక్కిపడిలేచి "అరెరే! అప్పుడే పొద్దుగూకిందే..." అంటూ తొందర పడింది.

ప్రభాకరం "ఉండండి... గుడ్డలు మార్చుకుని వస్తాను. మిమ్మల్ని యింటిదగ్గర దింపేస్తాను..." అన్నాడు లోపలికి పోతూ.

కమల ఫ్యానువంకనే చూసింది. అది రాత్రికి తమ వాటాలో తండ్రి మంచం పక్కనే ఉండాలి. ఉండి తీరాలి. దానికోసం... ఆమె చేతులతో ఫ్యానును తిప్పుతూ నిలబడింది. అంతలో ప్రభాకరం గదిలోకి వచ్చాడు.

కమల అతని దగ్గరగా నడిచివచ్చి "ఏమండి... అన్నట్టు మిమ్మల్నొకటి అడగటం మర్చిపోయాను. ఏంలేదూ... మా నాన్నకు వొంట్లో బాగులేదుకదా! ఊపిరాడక, గాలి అందక బాధపడుతున్నాడు. మా ఫ్యాను రిపేరుకిచ్చాను. అది యింకా రాలేదు. ఇప్పుడీఫ్యాను మనతో తీసుకుపోదాం. మళ్ళీ రేపెప్పుడన్నా వీలైనప్పుడు తెచ్చుకుందురు గాని...." అన్నది.

ప్రభాకరం "దానికేం?అలాగేచేద్దాం." అంటూ ప్లగ్ పిన్నుతీసి వైరును ఫ్యాను మెడ చుట్టూ చుట్టి "పదండి పోదాం..." అన్నాడు చొరవగా ఆమె భుజంమీద చెయ్యివేసి నవ్వుతూ.

కమలకూడా నవ్వి "థాంక్స్" అంటూ అతని చేతిని నెమ్మదిగా విడిపించుకుని నడుస్తూ "మా అన్నయ్య డబ్బు పంపగానే ఒక కొత్త సీలింగ్ ఫ్యాను కొనాలండీ...అది అన్నిటికంటె మంచిది. అలా అని మీ అద్దె డబ్బు యివ్వనని కంగారుపడకండి... ఈసారి మా అన్నయ్య చాలా డబ్బు పంపుతానని వ్రాశాడు... ఇదిగో వాడి ఉత్తరం..." అన్నది జాకెట్టులోంచి ఉత్తరాన్ని యివతలకి తీసి. అయితే ఆమె ఆ ఉత్తరం అతని చేతికివ్వలేదు.

కమల వెనక సీటులో ఫ్యాను పక్కనే కూర్చుని కారు నడుస్తూవుండగా చేతిలోని ఉత్తరం మళ్ళీ చదువుకుంది. ఆమె కళ్ళ వెంట ధారాపాతంగా నీళ్ళు వచ్చాయి. పమిట కొంగుతో ఎన్నిసార్లు తుడుచుకున్నా లాభం లేకపోయింది.

ప్రభాకరం వెనుకుదిరిగి చూసి "అదేమిటండి?" అని అడిగాడు ఆశ్చర్యంగా.

"ఏమీలేదు మా అన్నయ్య మహా చిలిపివాడు. చిన్నప్పటి నుంచీ అంతేవాడు. ఉత్తరం మళ్ళీ చదువుకుంటే వాడు గుర్తుకు వచ్చాడు" అన్నది కమల.

ప్రభాకరం మామూలుగా కారు నడిపాడు.

కమల వెనక్కు వాలి కళ్ళు మూసుకుంది. ఆ ఉత్తరం...అందులోని వార్త ఇప్పటికి తన కొక్కదానికి తెలుసు. ఎంత పెద్ద ఫ్యాక్టరీయో అది? ఈ పేట అంత ఉంటుందేమో? అందులో ఎన్ని భయంకరమైన ముళ్ళ చక్రాలు నిరంతరం తిరుగుతూ వుంటాయో! అయినా వాడు, అంత జాగ్రత్తపరుడు, ఆ పెద్ద ముళ్ళ చక్రాల మధ్య ఎలా చిక్కుకుపోయాడో! అసలా చక్రాల మధ్యకు ఎందుకు వెళ్ళాడు? ప్రాణం పోయేందుకు ఎంతసేపు పట్టి వుంటుంది? చివరి క్షణంలో వాడేమనుకుని ఉంటాడు? వందల మైళ్ళ దూరంలో ఉన్న ముద్దుల చెల్లెల్నీ, తండ్రినీ తలుచుకుని వుంటాడా? వాణ్ణి? ఆ మాంసం ముద్దను ఆ ఫ్యాక్టరీ అధికారులేంచేసి వుంటారు? అసలు మాంసం ముద్దయినా మిగిలిందా లేదా?

కారు ఆగింది. కళ్ళు తెరచి చూసేసరికి నలుగురైదుగురు పిల్లలు అప్పటికే కారుముందు నిలబడి చూస్తున్నారు. క్రింది అంతస్తులో అద్దెలకుంటున్న కొందరు అప్పటికే గుమ్మాలముందు నిలబడి చూస్తున్నారు. ఒకరితోఒకరు కళ్ళతోనే ఏదో మాట్లాడుకుంటున్నారు. మొదటి అంతస్తులో ఉండే కాలేజి విద్యార్థి చేతిలో ఒకే ఒక పుస్తకంతో అసూయగా కారువంక చూస్తూ నిలబడి వున్నాడు.

కమల కారులోనుంచి దిగి ఫ్యాను ఒకచేత్తో పట్టుకుని రెండడుగులు వేసి ప్రభాకరంతో "థాంక్సండీ...గొప్ప సాయం చేశారు. వుంటానిక. అన్నట్టు మీయింట్లో కొన్ని పుస్తకాలు కావాలి నాకు.రేపెప్పుడైనా వచ్చి తెచ్చుకుంటాను. మళ్ళీ నలగకుండా జాగ్రత్తగా చదివి యిచ్చేస్తానులెండి..." అన్నది నవ్వుతూ.

ప్రభాకరం కారు దిగి నిలబడి నవ్వుతూ "అలాగే... నేనే వచ్చి సమయం చూసి మిమ్మల్ని తీసుకుపోతాను" అన్నాడు. అదో రకంగా నవ్వుతూ.

కమల నెమ్మదిగా మెట్లు ఎక్కి వరండాలో నడిచి, మళ్ళీ మెట్లు ఎక్కి పైకి చేరుకున్నది. తమ వాటా గుమ్మం ముందుకు వచ్చి నిలబడి క్రిందకి చూసి నవ్వుతూ చేయి వూపింది. తర్వాత "ఇవాళ ఇంత ఎక్కువగా ఎలా మట్లాడగలిగానబ్బా! అనుకుని నవ్వుకుంటూ ఫ్యాను పట్టుకుని తలుపు తోసుకుని లోపలికి వెళ్ళింది. తండ్రి మంచంలో అస్తవ్యస్తంగా పడుకుని ఉన్నాడు.

కమల లైటువేసి ఫ్యాను తండ్రి మంచం పక్కగా రేకు పెట్టె మీద వుంచింది. ప్లగ్ పెట్టి ఫ్యాను వేసింది. అంతలో చల్లనిగాలి తెరలు తెరలుగా వీచింది. తర్వాత ఆమె "నాన్నా... నాన్నా" అంటూ తండ్రిని చేతితో తట్టిలేపేందుకు ప్రయత్నించింది. కాని ఆయన లేవలేదు. గాలి లేక, ఊపిరాడక... ఎంత బాధపడి తన్నుకుని ప్రాణాలు విడిచాడో మరి. ఒక చేయి మంచం క్రిందికి వ్రేలాడుతున్నది.

కమల కళ్ళముందు ఒక్కసారిగా నల్లని తెరలేవో దిగినట్టయింది. కళ్ళముందు కటిక చీకటి రాత్రి... గాలిలేని రాత్రి... ఆ చిక్కని చీకటిలో కూడా రేకు పెట్టెమీద ఉన్న ఫ్యాను తెల్లగా పడగ ఎత్తినపాములా కనబడింది.

ఆమె ఒక్కసారిగా బావురుమన్నది.

◆ ◆ ◆